ఎన్టీఆర్

భాగ్యనగరిలో 'దేవర'

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'దేవర' చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో మొదలైంది. రెండు వారాల పాటు ఏకధాటిగా జరుపనున్న ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. కథానాయిక జాన్వీకపూర్ సైతం ఈ షెడ్యూల్‌లో భాగం కానుందని తెలిసింది. ఇటీవలే ఈ చిత్రం గోవాలో ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. అక్కడ సముద్రపు నేపథ్యంలో పోరాట ఘట్టాలను తెరకెక్కించారు. విస్మరణకు గురైన తీర ప్రాంతపు నేపథ్య కథాంశంతో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

కాజల్ అగర్వాల్

దేనికైనా టైమ్ రావాలి!

తల్లి అయిన తర్వాత మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చింది కాజల్ అగర్వాల్. రావడం రావడమే 'భగవంత్ కేసరి'తో భారీ విజయాన్ని అందుకుంది. ఈ విషయం గురించి ఇటీవలే ఓ బాలీవుడ్ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది కాజల్. 'నేను రీఎంట్రీ ఇవ్వాలనుకున్న తర్వాత ఏ తరహా సినిమాలతో ఎంట్రీ ఇస్తే బావుంటుంది? అనే విషయంపై కొన్ని రోజులు తర్జనభర్జన పడ్డాను. అనుకోకుండా 'భారతీయుడు-2' అవకాశం తలుపుతట్టింది. అందులో నా పాత్ర సాధారణమైంది కాదు. ఆ పాత్ర కోసం 'కలరి పయాట్టు' అనే యుద్ధ విద్యను నేర్చుకున్నాను. చాలా కష్టపడ్డాను. ఆ సమయంలోనే 'సత్యభామ' ప్రపోజల్ వచ్చింది. అది లేడీఓరియంటెడ్ సబ్జెక్ట్. కథ బావుంది. ఆ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాల్సి వచ్చింది. ఈ రెండే నా రీఎంట్రీ మూవీస్ అని ఫిక్సయ్యాను. కానీ అనుకోకుండా 'భగవంత్‌కేసరి' చేయాల్సి వచ్చింది. అనిల్ నాకు మంచి ఫ్రెండ్ కావడం, ముఖ్యంగా బాలయ్యసార్ సినిమా కావడంతో మంచి అవకాశం వదులుకోవడం దేనికని ఓకే చెప్పాను. నా అదృష్టమేమోగానీ, పెద్ద విజయంతో నా సెకండ్ ఇన్నింగ్స్ మొదలైంది. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో ఇప్పుడు భారతీయుడు-2, సత్యభామ చేస్తున్నాను. మనం నిమిత్తమాత్రులం. మనకు ఏ టైమ్‌లో ఏది కరక్టో, దాన్ని దేవుడే ఇస్తాడు. గాడ్ ఈజ్ గ్రేట్' అంటూ చెప్పుకొచ్చింది కాజల్.



3000 కోట్ల టార్గెట్

తమిళ ఇండస్ట్రీలో జనరంజకమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా దర్శకుడు అట్లీ పేరును చెబుతారు. 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా ఆయన పాపులారిటీ పెరిగిపోయింది. బాలీవుడ్ అగ్ర హీరోలు సైతం అట్లీ డైరెక్షన్‌లో సినిమా చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు అట్లీ. దళపతి విజయ్, బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్‌తో భారీ మల్టీస్టారర్ తెరకెక్కించబోతున్నట్లు తెలిపారు. 'ఈ మధ్యే విజయ్, షారుఖ్ ఓ పార్టీలో కలుసుకున్నారు. అక్కడి నుంచి నాకు ఫోన్ చేశారు. మంచి మల్టీస్టారర్ కథ ఉంటే నటిస్తామని చెప్పారు. వారిద్దరి కోసం కథ సిద్ధం చేయబోతున్నా. నా తదుపరి సినిమా అదే అవుతుంది. ఇద్దరు సూపర్‌స్టార్స్ సినిమా కాబట్టి 3000కోట్ల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నా' అన్నారు. ప్రస్తుతం ఈ వార్త దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.



రణ్‌బీర్‌కపూర్, అనిల్ కపూర్

తండ్రీకొడుకుల అనుబంధానికి దర్పణం

'అర్జున్ రెడ్డి' వినడానికి సాధారణ ప్రేమకథే. కానీ అందులో ఏదో తెలియని డైరెక్టోరియల్ మ్యాజిక్ జనాన్ని కట్టిపడేసింది. తెరపై ఓ కొత్త వాతావరణం, మునుపెన్నడూ వెండితెర ఎరుగని యాటిట్యూడ్స్ ఇవన్నీ సందీప్‌రెడ్డి వంగా డైరెక్షన్‌లో కనిపిస్తాయి. ఆ ఫ్రెష్‌నెస్సే 'యానిమల్'పై అంచనాలు పెంచేలా చేసింది. దానికి తగ్గట్టే ఈ సినిమాకు సంబంధించిన ప్రచార చిత్రాలు కూడా అంచనాలను అంబరాలు తాకేలా చేస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన 'అమ్మాయి..' 'నే వేరే..' గీతాలు దేశవ్యాప్తంగా ఆదరణ సొంతం చేసుకున్నాయి. మంగళవారం మూడో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'నాన్న నువ్ నా ప్రాణం' అంటూ సాగే ఈ పాట తండ్రీకొడుకుల అనుబంధానికి అద్దం పడుతూ సాగింది. దానికి తగ్గట్టే హీరో రణబీర్, అనిల్‌కపూర్ స్టిల్ కూడా మనసుల్ని హత్తుకునేలా ఉంది. తండ్రిగా అనిల్‌కపూర్, అతనికి ఆసరా అయి నడిపిస్తున్న కొడుకుగా రణ్‌బీర్‌కపూర్‌ని ఈ స్టిల్‌లో చూడొచ్చు. కథపై ఆసక్తిని పెంచేలా ఈ ఈ స్టిల్ ఉంది. సోనూనిగమ్ అద్భుతంగా ఆలపించిన ఈ పాట తప్పకుండా అందరినీ ఆకట్టుకుంటుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, త్రిప్తి దిమ్రీ కీలక పాత్రలు పోషించారు. భూషణ్‌కుమార్, ప్రణయ్‌రెడ్డి వంగా ఈ చిత్రానికి నిర్మాతలు.

వెన్నెల కిషోర్

అయోమయ గూఢచారి

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సిటీకి ప్రమాదం రావడంతో ఆ కేసును పరిష్కరించడానికి కన్‌ఫ్యూజ్డ్ స్పై చారి వస్తారు. ఆ కేసును చారి ఎలా సాల్వ్ చేశాడనే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'చారి 111'. వెన్నెల కిశోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి టి.జి.కీర్తికుమార్ దర్శకుడు. సంయుక్త విశ్వనాథన్ కథానాయిక. బర్కత్ స్టూడియో పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని మంగళవారం విడుదల చేశారు. ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించే స్పై యాక్షన్ కామెడీ సినిమా ఇదని, సిల్లీ మిస్టేక్స్ చేసే కన్‌ఫ్యూజ్డ్ స్పై ఓ పెద్ద కేసును ఎలా సాల్వ్ చేశాడనేది ఈ సినిమా కథాంశమని, గూఢచారి సంస్థ హెడ్ పాత్రలో మురళీశర్మ నటించారని, ఆయన పాత్ర సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు చెప్పారు. ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వస్తున్నదని, చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి సంబంధించిన మరికొన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని నిర్మాత తెలిపారు. బ్రహ్మాజీ, సత్య, రాహుల్ రవీంద్రన్, పావనిరెడ్డి, తాగుబోతు రమేశ్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కషిష్ గ్రోవర్, సంగీతం: సైమన్ కె.కింగ్, నిర్మాణం: బర్కత్ స్టూడియోస్.

సూపర్‌హీరో హనుమాన్

ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'హను-మాన్'. సంక్రాంతికి విడుదల కానున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన అంచనాలున్నాయి. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ పాన్ ఇండియా సోషియోఫాంటసీ చిత్రంలో తేజ సజ్జా కథానాయకుడిగా నటిస్తున్నాడు. గౌరహరి, అనుదీప్‌దేవ్, కృష్ణ సౌరభ్ కలిసి స్వరాలందించిన ఈ చిత్రంలోని ఓ పాటను మంగళవారం బాలలదినోత్సవం సందర్భంగా విడుదల చేశారు. 'సూపర్‌హీరో హనుమాన్..' అంటూ సాగే ఈ పాట సంగీత పరంగానే కాక, విజువల్ ప్రెజెంటేషన్ కూడా అద్భుతంగా ఉంటుందని, సూపర్‌హీరోలను ఇష్టపడే పిల్లలకోసం నిజమైన సూపర్‌హీరో హనుమాన్ సూపర్ పవర్ చూపించటానికే బాలల దినోత్సవం రోజు ఈ పాటను విడుదల చేశామని మేకర్స్ చెప్పారు. జనవరి 12న పాన్ ఇండియా స్థాయిలోనే కాక ఇంగ్లిష్, స్పానిష్, కొరియన్, చైనీస్, జపనీస్ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో వినయ్‌రాయ్, వరలక్ష్మి శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దాశరథి శివేంద్ర, నిర్మాత: కె.నిరంజన్‌రెడ్డి.

స్వాతిరెడ్డి, సురేశ్‌వర్మ

తొలి ప్రయత్నంలోనే మంచి టీమ్ దొరికింది

'మంగళవారం' మాకు బాగా నచ్చిన కథ. నిజానికి ఈ సినిమాను దర్శకుడు అజయ్‌భూపతి తన సొంత బ్యానర్‌లో చేయాలనుకున్నారు. ఈ కథ విన్నప్పుడు ప్రొడ్యూస్ చేయడానికి నాకీ కథ కరెక్ట్ అనిపించింది. అజయ్ కూడా కాదనలేదు. అంతా డెస్టినీ' అన్నారు నిర్మాత గునుపాటి స్వాతిరెడ్డి. 'ఆర్‌ఎక్స్ 100'ఫేం అజయ్‌భూపతి దర్శకత్వంలో ఎం.సురేశ్‌వర్మతో కలిసి ఆమె నిర్మించిన చిత్రం 'మంగళవారం'. పాయల్‌రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా నటించారు. ఈ శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర నిర్మాతలు స్వాతిరెడ్డి, సురేశ్‌వర్మ విలేకరులతో ముచ్చటించారు.

బన్నీ వల్లే ఇది సాధ్యమైంది

నిర్మాతను కావడం నా కల. ఆ విషయం బన్నీకి ఎలా తెలిసిందో ఏమో 'ఎందుకు కలగా వదిలేయాలి? ట్రై చెయ్.. తొలి ప్రయత్నం కాబట్టి నీతో ఎవరైనా పార్ట్‌నర్ ఉంటే బావుంటుంది' అన్నాడు. సురేశ్‌వర్మగారికి కూడా సేమ్ డ్రీమ్. అలా ఇద్దరం కలిసి ప్రొడక్షన్ స్టార్ట్ చేశాం. అల్లు అర్జున్, నేనూ చాలాకాలంగా స్నేహితులం. మా మధ్య మంచి బాండింగ్ ఉంది.

అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి

తొలి సినిమా కాబట్టి చిన్నవాళ్లతో వెళ్లడమే కరెక్ట్ అని ఈ సినిమా చేశాం. మా మంగళవారంకు కథే హీరో. ఈ కథలో వినోదంతోపాటు సందేశం కూడా ఉంది. డార్క్ థ్రిల్లర్ అయినప్పటికీ ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. రెగ్యులర్ సినిమా కాకుండా, ఓ విభిన్నమైన సినిమా ద్వారా నిర్మాతలం అవుతున్నందుకు ఆనందంగా ఉంది.

కథలో ఆ మాస్క్ కీలకం

పోస్టర్స్ చూసి అందరూ 'కాంతారా' ఇన్‌స్పిరేషన్ అంటున్నారు. నిజానికి ఈ కథను అజయ్ 'కాంతారా' కంటే ముందే నాకు చెప్పాడు. ఈ కథలో మాస్క్ అనేది చాలా ఇంపార్టెంట్. ఎన్నో స్కెచ్‌లు వేయించి చివరకు ఈ మాస్క్ ఓకే చేశాం. కేవలం దర్శకత్వం మాత్రమే కాకుండా అన్ని బాధ్యతలూ భుజాలపై మోశాడు అజయ్. మాకు వత్తిడి లేకుండా చేశాడు. తొలి సినిమాకే మంచి దర్శకుడు, మంచి టీమ్ దొరకడం మా అదృష్టం. పాయల్ రాజ్‌పుత్ కేరక్టర్ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. చాలామంది కొత్తవాళ్లను ఆడిషన్స్ చేసి తీసుకోవడం జరిగింది. అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా ఇది. సాంకేతికంగా నెక్ట్స్ లెవల్లో ఉంటుంది.

శనివారం యాక్షన్

హీరో నాని సినిమాకీ సినిమాకీ మధ్య ఎక్కువ గ్యాప్ తీసుకోవట్లేదు. యమ స్పీడ్‌తో సినిమాలు చేసుకుపోతున్నాడు. 'హాయ్ నాన్న' షూటింగ్‌ను పూర్తి చేసేసి 'సరిపోదా శనివారం' షూటింగ్‌లో బిజీ అయిపోయాడు నాని. మంగళవారం హైదరాబాద్‌లో ఈ సినిమా షెడ్యూల్ యాక్షన్ ఎపిసోడ్‌తో ప్రారంభమైంది. రామ్‌లక్ష్మణ్ ఫైట్‌మాస్టర్ల నేతృత్వంలో పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లోనే కొంత టాకీ పార్ట్ కూడా పూర్తిచేస్తామని దర్శకుడు వివేక్ ఆత్రేయ చెబుతున్నారు. నానితోపాటు ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారని ఆయన అన్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో ఎస్.జె.సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి. సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాతలు: డి.వి.వి.దానయ్య, కళ్యాణ్ దాసరి.

యువత మెచ్చే 'జమాన'

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్ నిర్మాతలు. ఈ సినిమా టైటిల్ ప్రోమోను ఇటీవల దర్శకుడు వెంకీ కుడుముల విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'నేటి యువతరం ఆలోచనలకు అద్దం పట్టే చిత్రమిది. హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో తెరకెక్కించాం. చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుంది' అన్నారు. నేటి యూత్‌కి కనెక్ట్ అయ్యే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయని హీరో సూర్య శ్రీనివాస్ చెప్పారు. స్వాతి కశ్యప్, జారా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగన్ ఏ, సంగీతం: కేశవ కిరణ్, రచన-దర్శకత్వం: భాస్కర్ జక్కుల.

రాధా మాధవ ప్రేమాయణం

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటిస్తున్న చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకుడు. గోనల్ వెంకటేష్ నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫస్ట్‌లుక్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'గ్రామీణ నేపథ్య ప్రేమకథా చిత్రమిది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలుంటాయి. ప్రేమ ప్రయాణంలోని అనుభూతులకు అద్దం పడుతుంది' అన్నారు. మేక రామకృష్ణ, జయప్రకాష్, ప్రియ, నవీన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: తాజ్ జీడీకే, సంగీతం: చైతు కొల్లి, కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, దర్శకత్వం: దాసరి ఇస్సాకు.

చేదుజ్ఞాపకాన్ని గుర్తుచేసి ఇరిటేట్ చేశాడు

'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో ఒళ్లుమండే ప్రశ్నలడుగుతూ పుళ్లమీద కారం జల్లే పనిలో బిజీ అయిపోయాడు కరణ్‌జోహార్. రీసెంట్ ఇంటర్వ్యూలో కరీనా, అలియా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో చేదు జ్ఞాపకాలను వెలికితీస్తూ కరీనాను కాస్తంత ఇబ్బందికి గురిచేసే ప్రయత్నమే చేశాడు కరణ్. 'ఇటీవల జరిగిన 'గదర్- 2' పార్టీకి ఎందుకు అటెండ్ కాలేదు. అమీషాకూ నీకూ మధ్య ఏదో భయంకరమైన ఫ్లాష్‌బ్యాక్ ఉన్నట్టుంది?' అని అడిగాడు కరణ్. 'ఆ విషయం గురించి ఇప్పుడు మాట్లాడాలనుకోవడంలేదు' అంటూ ముక్తసరిగా సమాధానమిచ్చేసింది కరీనా. 'కహోనా ప్యార్ హై'లో నువ్వే కదా ఫస్ట్ హీరోయిన్?' అని కరణ్ రెట్టించి అడగడంతో కరీనాకు ఫేస్ మారిపోయింది. సమాధానమివ్వకుండా మౌనంగా ఉండిపోయింది. ఇక అసలు విషయానికొస్తే.. 2000లో విడుదలైన 'కహోనా ప్యార్‌హై' అఖండ విజయాన్ని చూసింది. ఆ సినిమాకు తొలుత హీరోయిన్‌గా దర్శకుడు రాకేష్‌రోషన్ కరీనానే ఎంపిక చేశాడు. కానీ అనుకోని మనస్పర్థల వల్ల కరీనాను తొలగించి అమీషా పటేల్‌ని తీసుకోవడం జరిగింది. అప్పట్నుంచి కరీనాకు, అమీషాకు మాటల్లేవ్. ఈ విషయాన్ని అమీషానే ఓ ఇంటర్వ్యూలో స్వయంగా తెలిపింది. జరిగిపోయిన ఆ పాత జ్ఞాపకాన్ని గుర్తుచేస్తూ కరీనాను దాదాపుగా ఇరిటేట్ చేశాడు కరణ్‌జోహార్. అంతటితో వదల్లేదు తను. 'దీపికా పదుకొణేకు నువ్వు పోటీ అనుకుంటున్నావా?' అనడిగాడు. ' ఆ ప్రశ్న నువ్వడగాల్సింది నా పక్కనే ఉన్న అలియాను.. నన్ను కాదు' అంటూ డిగ్నిఫైడ్ సమాధానంతో కరణ్‌ను ఖంగు తినిపించింది కరీనా.

కరీనా కపూర్